క్లుప్తంగా

కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ

కృష్ణగిరి: రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడా పోటీల్లో స్థానిక కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులు సత్తాచాటడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి పేర్కొన్నారు. స్థానిక విద్యాలయంలో శుక్రవారం ఆమె క్రీడాకారిణులతో పాటు పీఈటీ సుప్రియను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యాలయంలోని 9వ తరగతి చదువుతున్న అంజలి, ఉమాదేవి ఈ నెల 4న విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని సత్తాచాటి జట్టును విజేతగా నిలిపారన్నారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మెరుగైన వైద్యసేవలందించండి



జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

హాలహర్వి: వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలని ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె హాల హర్వి పీహెచ్‌సీ, జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సలహాలు తెలియజేశారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంటారని, మెరుగైన వైద్యసేవలు అందిస్తారన్నారు. డాక్టర్లు మన్సర్‌వలీ, హెచ్‌ఎం వెంకటరమణ, సూపర్‌వైజర్లు అబ్రహం, ఆదినారాయణ, సుగుణ, సీహెచ్‌ఓలు, సిబ్బంది వెంట ఉన్నారు.

శుద్ధ జలం సరఫరాకు చర్యలు



ఉప్పర్లపల్లిలో శుద్ధజల ప్లాంటును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

తుగ్గలి: ప్రజలకు శుద్ధ జలం సరఫరా చేయాలనే లక్ష్యంతో గతంలో ఉప్పర్లపల్లి వద్ద రూ.3 కోట్లతో ప్లాంటు ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటు నుంచి 16 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా శుద్ధ జలం సరఫరా చేసేవారు. అయితే కాంట్రాక్టర్ నీటిని సరఫరా చేసే కార్మికులకు, టెక్నీషియన్‌కు సరిగా జీతాలు చెల్లించకపోవడంతో ఏడాదిగా ప్లాంట్ మూతపడింది. ఈ క్రమంలో శుద్ధజల సరఫరాకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్లాంటును పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకుందని త్వరలో కనీసం 16 గ్రామాలకు శుద్ధ జలం అందేలా చూస్తామన్నారు. గతంలో మెయింటెనెన్స్, పని చేసిన వేతనాలు రూ.4 లక్షల దాకా రావాల్సి ఉందని కార్మికులు డీఈ దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ బకాయిలు, మెయింటెనెన్స్‌పై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డీఈ తెలిపారు. తుగ్గలి, వెల్దుర్తి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు హనుమంతు, మునయ్య, సర్పంచ్ గౌరవ సలహాదారు సురేంద్రనాథరెడ్డి, ఉప సర్పంచ్ రామాంజిని, సచివాలయ కన్వీనర్ బీమానాయక్ వెంట ఉన్నారు.

సురక్షతో మెరుగైన వైద్యసేవలు



బిణిగేరిలో సురక్ష కిట్లను అందజేస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించి 361 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. వైద్య శిబిరాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ప్రవీణ్‌కుమార్ పరిశీలించి రోగులకు జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేశారు. డాక్టర్లు దుర్గాబాయి, రంజిత్, మంజుల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

మద్దికెర: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. శుక్ర వారం మండల పరిధిలోని హంప గ్రామంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

హొళగుంద: చిన్నహ్యాట గ్రామంలో సర్పంచ్ హేసన్, పంచాయతీ సెక్రటరీ షఫి ఆధ్వర్యంలో గజ్జహళ్లి, హొళగుంద పీహెచ్‌సీల డాక్టర్లు బిందుమాధవి, న్యూటన్‌తో పాటు కర్నూలుకు చెందిన వైద్య నిపుణులు, సిబ్బంది ప్రజలకు వైద్య సేవలందించారు. బీపీ, షుగర్, హెచ్‌బీ లాంటి సాధారణ పరీక్షలతో పాటు అన్ని రకాల జబ్బులున్న వారిని పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలు చెప్పి ఉచితంగా మందులను పంపిణీ చేసారు. ఈ క్యాంప్‌లో 401 మందికి వైద్య సేవలందించగా ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. గ్రామస్తులతో పాటు ఎంపీడీఓ ఆజాద్, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం




కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న సిబ్బంది, నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ బరెన్‌సాహెబ్

తుగ్గలి: పిల్లల కడుపులోని నులి పురుగులను అంతమొందిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పగిడిరాయి, తుగ్గలి పీహెచ్‌సీల వైద్యులు హరిత, ఎంఎండీ మినాజ్‌పాషా, ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అమిబాద్, పగిడిరాయి, తుగ్గలి పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యులు మాత్రలు వేశారు. చేతులు శుభ్రంగా ఉంచుకోకపోవడం, మట్టిలో ఆడుకుంటూ చేతులు కడుక్కోకుండా తినడం వల్ల పిల్లల కడుపులో కొంకి పురుగు, నులిపురుగు, బద్దె పురుగు, గుండ్రని పురుగులు ఆవాసాలుగా ఏర్పడతాయన్నారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుల తగ్గుతుందని వివరించారు. ఆ పురుగులను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యాధికారి ప్రదీప్, వరప్రసాద్ సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తమ సిబ్బందితో కలిసి విద్యార్థులకు నులి పురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు మింగించారు. మండలంలోని 50 పాఠశాలలు, 49 అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు కాలేజీల్లో చదువుతున్న 1 నుంచి 19 ఏళ్లలోపు 12,608 మంది విద్యార్థులకుగాను 12,101 మందికి మాత్రలు వేశామన్నారు. విద్యార్థినులు నులిపురుగుల నివారణపై రూపొందించిన చార్టులు ఆకట్టుకున్నాయి.

మద్దికెర: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. పిల్లల్లో రక్తహీనత నివారణకు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిప్పగిరి: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ బరెన్ సాహెబ్ శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిస్తూ పోస్టర్ విడుదల చేశారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని వివిధ పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. నందవరం ఎంపీపీ స్పెషల్ స్కూల్‌లో ఎంఈఓ రఘునాథ్ విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్స్ మింగించారు. 1 నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ మాత్రలు అందిస్తున్నట్లు చెప్పారు. హెల్త్ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.



అమినాబాద్ స్కూల్‌లో బాలుడికి మాత్ర మింగిస్తున్న డాక్టర్

'సిద్ధం' సభను విజయవంతం చేద్దాం

ఆలూరు: ఈనెల 18న అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే సిద్ధం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు సెర్ప్ సీఈఓ రాక

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామానికి శనివారం సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ వస్తున్నట్లు ఏపీఎం మహేశ్వరయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నలుగురు పొదుపు మహిళలు రూ.40 వేల బ్యాంక్ లోన్‌తో పెరటి కోళ్ల పెంపకానికి షెడ్లు తయారు చేసుకున్నట్లు చెప్పారు. వీరికి సీఈఓ చేతుల మీదుగా పెరటి కోళ్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



పురుగు మందు తాగిన గుర్తు తెలియని వ్యక్తి

వెల్దుర్తి(కృష్ణగిరి) : వెల్దుర్తి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇతని వివరాలు తెలిసిన వారు 9121101118 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సిద్ధేశ్వర స్వామి జాతర పోస్టర్ల విడుదల



జాతర పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ ధర్మకర్తలు, గ్రామపెద్దలు

హొళగుంద: మండల ప్రజల ఆరాధ్యదేవుడిగా పూజింపబడుతున్న హొళగుంద సిద్ధేశ్వర స్వామి జాతర ఉత్సవాలకు భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆలయ వంశ పారంపార్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్వామి ఆలయ ఆవరణలో ఆయన గ్రామపెద్దలతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పంపన్నగౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి మొదలయ్యే జాతరకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 13న సిద్ధేశ్వర స్వామికి కంకణధారణ, 16న నంది ఉత్సవం, 17న గజోత్సవం, 18న రథోత్సవం, 19న లంకాదహనం, 20న వసంతోత్సవ కార్యక్రమాలతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆయన చెప్పారు. భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, గ్రామపెద్దలు మురళి, ఊకూరు కాడసిద్ధప్ప, సురేష్, రేణుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచారన్నారు. అంతేగాకుండా సచివాలయం, మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారని చెప్పారు. మండలంలో నాడు–నేడు నిధులతో 34 పాఠశాలల్లో మరమ్మతులు, డెస్కుల ఏర్పాటు, గదుల నిర్మాణం, రన్నింగ్ వాటర్ సౌకర్యంతో మరుగుదొడ్లను ఏర్పాటు చేసి పాఠశాలల రూపురేఖలు మార్చాడన్నారు. బిల్లేకల్లు గ్రామంలో ఒక వ్యక్తి ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించాడని విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డీటీ గాయిత్రిని కోరారు. అనంతరం విద్య, వ్యవసాయం, విద్యుత్, రెవెన్యూ, ఉపాధి శాఖలలో మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి పనుల గురించి అధికారులు వివరించారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలను గుర్తించండి



మాట్లాడుతున్న ఆర్వో రామునాయక్

ఆలూరు: పోలింగ్ కేంద్రాలలో సమస్యలను సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌ఓలు గుర్తించాలని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ ఆదేశించారు. స్థానిక ఉమా కల్యాణ మండపంలో శుక్రవారం ఆలూరు తహసీల్దార్ వి.చంద్రశేఖరయ్య ఆధ్వర్యంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, మండలాలకు చెందిన తహసీల్దార్లు, బీఎల్‌ఓలు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ బూత్‌లో ర్యాంప్‌లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం తదతర సౌకర్యాలు కల్పించాలన్నారు. సమస్యలు ఉన్న కేంద్రాలను గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలుచేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మత్తుమందు ఇచ్చి నగల అపహరణ



బాధితురాలు ఉమాదేవి (ఇన్‌సెట్) దొంగలు ఉపయోగించిన పౌడర్

ఎమ్మిగనూరురూరల్: మహిళకు మాయమాటలు చెప్పి.. మత్తు మందు ఇచ్చి బంగారు చైన్‌ను అపహరించుకెళ్లిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో పట్టణంలోని లక్ష్మీపేటలో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని లక్ష్మీపేటలో ఈరన్న, ఉమాదేవి దంపతులు మగ్గం పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈరన్న బయటకు వెళ్లడంతో ఉమాదేవి ఇంట్లో మగ్గం పనిలో ఉండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇంటి ముందు టైల్స్‌ను లిక్విడ్‌తో క్లీన్ చేస్తామని చెప్పడంతో ఆమె సరేనని చెప్పింది. అంతలోనే బంగారు, వెండి ఆభరణాలకు మెరుగు పెడతామని చెబుతూ ఆమెపై తెల్లని పౌడర్ చల్లారు. కొద్దిసేపటికే ఉమాదేవి స్పృహ తప్పి పడిపోవడంతో దొంగలు ఆమె మెడలోని నాలుగు తులాల తాళిబొట్టు చైన్, మరో తులం చిన్న చైన్‌ను తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. తర్వాత ఆమెకు మెలకువ వచ్చి చూడగా ఇద్దరు వ్యక్తులు కనపించకపోవడం, తన మెడలోని రెండు బంగారు చైన్లు మాయం కావడంతో భర్త ఈరన్నకు ఫోన్ చేయగా ఆయన ఇంటికి చేరుకున్నాడు. జరిగిన విషయం భర్తకు చెప్పడంతో ఇద్దరూ వెళ్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాయమాటలు విని మోసపోయానని ఉమాదేవి బోరున విలపించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి పామయ్య తిరునాల



పక్కపక్కనే సమాధికాబడ్డ గురుశిష్యులు పామయ్యతాత, హనుమంతయ్యల ఆలయాలు

వెల్దుర్తి: మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామ సమీపాన సమాధి అయిన పామయ్య తాత తిరునాల ఈనెల 11న ఆదివారం ప్రారంభంకానుంది. అవధూత లద్దగిరి పెద్దరాందాసు అంశగా పిలవబడే బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన పామయ్యతాత వర్ధంతి (తెలుగు సంవత్సరం మాఘమాసం తొలి ఆదివారం) సందర్భంగా ఏటా అదేరోజున తిరునాల జరుపుకుంటున్నారు. మండల పరిధిలోని నార్లాపురం గ్రామం పెనికలపాటి వంశీయులు ఎడ్లబండ్ల ద్వారా తీసుకువచ్చే తొలి నైవేద్యంతో, తాత వారసులైన బొమ్మిరెడ్డిపల్లె వాసుల పూజలతో రేపు వేడుకలు ప్రారంభమవుతాయి.

రెండ్రోజుల పాటు వేడుకలు

పామయ్య తిరునాల పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు, రాత్రి చెక్కభజన, నందికోలసేవ, తదుపరి రోజు రంగులు చల్లుకోవడంతోపాటు, బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేయనుండగా గ్రామంలో రెండ్రోజుల పాటు అంగళ్లు వెలియనున్నాయి. తిరునాల పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ సునీతారెడ్డి తెలిపారు.

12న బండలాగుడు పోటీలు

తిరునాల సందర్భంగా ఈనెల 12న అఖిల భారత ఒంగోలు జాతి కోడెల సీనియర్స్ విభాగంలో వృషభాల బండలాగుడు పోటీలు సర్పంచ్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించనున్నారు. ఐదుగురు విజేత వృషభరాజుల యజమానులకు వరుసగా రూ.50 వేల నుంచి రూ.5వేల వరకు నగదు బహుమతులు అందించనున్నారు. పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆలూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని మొలగవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు రేష్మ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వివిధ గ్రామాల గర్భిణులకు తల్లీబిడ్డ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు పాలు, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయాలు, చేపలు, మాంసం తదితర పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

అవి-ఇవి

గ్రామాల్లో సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పు అయ్యేలా చూడాలన్నారు. ఎంపీహెచ్‌ఓ అంద్రూస్, సూపర్‌వైజర్లు, చంద్రకళ, బాషా, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని 847 పొదుపు గ్రూపులకు చెందిన 8561 మంది మహిళలకు శనివారం 11 గంటల నుంచి మండల కేంద్రంలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ పథకం కింద ప్రభుత్వం నాలుగో విడతగా మంజూరు చేసిన రూ.4,94,00,070 చెక్కును సీఐ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న బహిరంగ సభలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి లబ్ధిదారులకు అందించనున్నట్లు ఏపీఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి మహిళలు, పార్టీ శ్రేణులు విరివిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్ష, కార్యదర్శులు బొమ్మన రవిరెడ్డి, వెంకట్‌నాయుడు కోరారు. అలాగే మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో రూ.38.15 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.08 లక్షలతో నిర్మించిన ఆర్బీకే నూతన భవనాలను, రూ.29.90 లక్షలతో నిర్మించిన 40 వేల లీటర్ల కెపాసిటీ గల ఓవర్‌హెడ్ ట్యాంకును శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు సురేంద్రనాథ్ రెడ్డి, మునెయ్య తెలిపారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ రంగనాథ స్వామి దేవాలయం నూతన ధర్మకర్తల మండలికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బి.చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు దేవదాయ శాఖ జిల్లా అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఆసక్తిగల వారు ఫిబ్రవరి 22వ తేదీలోగా కర్నూలులోని దేవదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌ఫోటోలను జతపరచి సమర్పించాలన్నారు.

నవోదయ ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు

ఎమ్మిగనూరుటౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాల నిమిత్తం శనివారం పట్టణంలోని పలు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ప్రవేశపరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ–2 మధుసుదన్‌రాజు శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు, వీవర్స్ కాలనీ హైస్కూల్, ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎస్ఎస్ఎస్ హైస్కూల్, మాచాని ఇంగ్లిష్ మీడియం స్కూల్ పరీక్షా కేంద్రాలతో పాటు బనవాసిలోని నవోదయ పాఠశాల, ఏపీ గురుకుల పాఠశాలలో కూడా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అలాగే పర్యవేక్షణకు సూపరింటెండెంట్‌లను, అబ్జర్వర్లను నవోదయ ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

దేవనకొండ: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని ఏఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం డబ్బులను వారి ఖాతాల్లో త్వరగా జమ చేయాలని చైర్మన్ కోరారు. ప్రస్తుత రబీ సీజన్‌లో పంట నమోదు, ఈ–కేవైసీని త్వరగా పూర్తిచేయాలన్నారు. కమిటీ సభ్యులు రంగన్న, ఏఈఓలు యోగేంద్ర, రంగన్న, జయరాం, వీఏఏలు సలీం, మునిస్వామి, అబ్దుల్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, బిలేహాల్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఏపీఓ హేమసుందర్ పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు ఎండ వేడిమికి గురికాకుండా ఉదయం పూటే పనులకు వచ్చి సకాలంలో పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ బి.రాముడు, ఫీల్డ్ అసిస్టెంట్ పట్టెప్ప, జయప్ప తదితరులు వెంట ఉన్నారు.

నేడు గ్రామాల్లో పర్యటన

ఆస్పరి: మండలంలోని కలపరి, యాటకల్లు, తొగలుగల్లు, తంగరడోణ గ్రామాలలో శనివారం వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయ కర్త బుసినె విరుపాక్షి పర్యటించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పెద్దయ్య శుక్రవారం తెలిపారు. గ్రామాల్లో పర్యటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారని చెప్పారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

టీబీ డ్యాంలో నిలకడగా నీటి నిల్వ

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ నిలకడగా ఉంది. గత నెలన్నర రోజులుగా 9 టీఎంసీలకు పైగానే నీరు నిల్వ ఉన్నాయి. డ్యాంలో నీటి మట్టం పూర్తిగా పడిపోవడంతో గతేడాది డిసెంబర్ 25న తుంగభద్ర బోర్డు అధికారులు ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపి వేశారు. దీంతో కాలువ నీరు లేక బోసి పోయింది. పశ్చిమ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరునందించే తుంగభద్ర దిగువ (ఎల్లెల్సీ) కాలువ ఈ ఏడాది వర్షాభావం వల్ల ఒక కారు పంటకు మాత్రమే సాగునీటిని అందించింది. వేసవిలో తాగునీటి అవసరాల కోసం కొద్ది రోజులు కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. ఈ నీటి మీదే ఆధారపడిన ప్రజలు, రైతులు వర్షాలు మొదలయ్యే జూలై నెల వరకు నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక టీబీ డ్యాంలో శుక్రవారం 1588.04 అడుగులతో 9.469 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో నిల్ ఉండగా అవుట్‌ఫ్లో రూపంలో 87 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

సచివాలయ సిబ్బంది పాత్ర కీలకం

తుగ్గలి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో సచివాలయ సిబ్బంది పాత్ర కీలకమని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నా రు. శుక్రవారం జీ.ఎర్రగుడి, ఉప్పర్లపల్లి, గిరిగెట్ల సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. జగనన్న లే అవుట్లలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రి య, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, యాప్‌విని యోగం, సర్వీసులు, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహన తదితర వాటిపై చర్చించారు. సిబ్బందికి, వలంటీర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమయపాల న తప్పక పాటించాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల గౌరవ సలహాదారులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు

పత్తికొండ రూరల్: పత్తికొండ – కర్నూలు రోడ్డులో కొలువైన అభయాంజనేయ స్వామికి శుక్రవారం భక్తులు అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రవి స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామార్చన తదితర పూజలు చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం వీవీకే పురుషోత్తం,కృష్ణవేణి దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, అన్న ప్రసాదం స్వీకరించారు.